క్లుప్తంగా

మెగా కంటి వైద్య శిబిరానికి స్పందన



కొనకొండ్లలో నిర్వహించిన కంటి వైద్య శిబిరం

వజ్రకరూరు: మండలంలోని కొనకొండ్ల ప్రభుత్వాస్పత్రిలో ఎ మ్మెల్సీ, ప్రివిలేజ్ కమిటీ చైర్మన్ వై.శివరామిరెడ్డి ఆధ్వర్యంలో సుశీల నేత్రాలయ – కర్నూలు సాయి ఎడ్యుకేషనల్ సొసైటీ కర్నూల్ సహకారంతో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరానికి 200 మంది హాజరయ్యారు. 37 మందికి కంటి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచు నంచర్ల ఇందిరమ్మ, మాజీ ఎంపీపీ రామచంద్ర, ఆసుపత్రి ప్రతినిధులు నాగార్జున తులసీకుమార్, ఆస్పత్రి వైద్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డుల సేవలు ప్రశంసనీయం



హోంగార్డు కృష్ణవేణిని సన్మానిస్తున్న ఎస్పీ జగదీష్

అనంతపురం: పోలీసు శాఖలో హోంగార్డుల సేవలు ప్రశంసనీయమని జిల్లా ఎస్పీ పి.జగదీష్ కొనియాడారు. జిల్లా పోలీసుల శాఖలో సుదీర్ఘకాలంగా సేవలు అందించిన కూడేరు పోలీస్ స్టేషన్ మహిళా హోంగార్డు కృష్ణవేణి సోమవారం ఉద్యోగ విరమణ పొందారు. సోమవారం ఎస్పీ తన చాంబర్‌లో హోంగార్డు కృష్ణవేణిని పూలమాల, శాలువాతో ఘనంగా సన్మానించారు.కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వర రెడ్డి, ఆర్‌ఎస్‌ఐ జాఫర్, ఏఆర్ ఎస్ఐలు, హోంగార్డులు పాల్గొన్నారు.

వర్షానికి కూలిన ఇల్లు



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న బాధితులు

శెట్టూరు : మండల కేంద్రంలో ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి యాదవ గోపికి చెందిన ఇల్లు కూలింది. వర్షానికి ఇల్లు కూలిపోతుందనే భయంతో ఇంట్లో నిద్రించలేదు. దీంతో పెనుప్రమాదం తప్పింది. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో బాధితులు తహసీల్దార్ ఈశ్వరయ్య శెట్టికి వినతిపత్రం అందించారు.

రాష్ట్రంలో రాక్షస పాలన



కళ్యాణదుర్గం డీఎస్పీ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఎస్సీ,ఎస్టీ జేఏసీ నాయకులు

కళ్యాణదుర్గం రూరల్: కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత రాష్ట్రంలో రాక్షసపాలన సాగుతోందని ఎస్టీ, ఎస్సీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి మండిపడ్డారు. సోమవారం పట్టణంలోని డీఎస్పీ కార్యాలయం ఎదుట ఎస్సీ,ఎస్టీ జేఏసీ ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. జేఏసీ నాయకులు మాట్లాడుతూ బ్రహ్మసముద్రం మండలం కుర్లగుంటలో ఎస్సీ మహిళా కూలీలు మమత, రాధమ్మ, తులసి మామిడి కాయలు దొంగలించారంటూ అగ్రకులానికి చెందిన రామాంజనేయులు, అనిల్ చౌదరి, కృష్ణమూర్తి చౌదరి దాడి చేయడం దారుణమన్నారు. దాడిలో గాయపడిన మహిళలు ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారన్నారు. ఘటనపై అధిక పార్టీ నేతల ఒత్తిళ్లతో పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. అనంతరం పట్టణ సీఐ యువరాజు మాట్లాడుతూ బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ జేఏసీ తాలూకా అధ్యక్షుడు చెలిమప్ప, ఎస్సీ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీటీపై ఆంక్షలు సరికాదు

వజ్రకరూరు: ఆర్డీటీపై కేంద్ర ప్రభుత్వం ఆంక్షలు సరికాదని వైఎస్సార్‌సీపీ ఎస్టీసెల్ జిల్లా ఉపాధ్యక్షుడు వడ్డియా గోవిందు నాయక్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పేద,బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ఆర్డీటీ సేవా కార్యక్రమాలు చేపడుతోందన్నారు. విద్య,వైద్యం తోపాటు గృహ నిర్మాణాలు, విద్యార్థులకు స్కాలర్ షిప్పులు తదితర వాటిని కూడా నిస్వార్థంగా అందించినట్లు తెలిపారు. అలాంటి సంస్థపై కేంద్రం ఆంక్షలు విధించి, పేదల కుటుంబాల్లో చీకటి నింపడం సరికాదన్నారు.



మధు టాకీస్ వెనుక ఖాళీ స్థలంలో నిలిచిన మురుగునీరు, ఏపుగా పెరిగిన ముళ్లకంపలు, చెట్లు



17వ వార్డు కేరమ్మకట్ట సమీపంలోని డ్రైనేజీ, ఖాళీ స్థలంలో పారిశుధ్య పరిస్థితి ఇదీ..



కణేకల్లు రోడ్డుకు ఆనుకొని పార్కుకు వెళ్లే రహదారి పక్కన ఖాళీ స్థలంలో పేరుకుపోయిన చెత్తాచెదారం

పట్టణం..పడకేసిన పారిశుధ్యం

రాయదుర్గంటౌన్: పట్టణంలో పారిశుధ్యం పడకేసింది. కూటమి సర్కారు ఏర్పాటైన తర్వాత అధికారుల పర్యవేక్షణ కొరవడి ఎక్కడా చూసినా అపరిశుభ్రత నెలకొంది. దీనికితోడు పట్టణంలోని శివారు ప్రాంతాలతోపాటు నడిబొడ్డున కాలనీల్లోని ఇళ్ల మధ్యనున్న ఖాళీ స్థలాలన్నీ ముళ్లచెట్లు, మురుగునీరు, చెత్తాచెదారంతో నిండిపోయి దుర్వాసన వస్తోందని పట్టణవాసులు అంటున్నారు. దీంతో మురుగునీటితోపాటు వర్షపునీరు నిల్చి ఖాళీ స్థలాలు చిన్నపాటి కుంటలు, చెరువులను తలపిస్తున్నాయి. ఇప్పటికే సీజనల్ వ్యాధులు, డయేరియా విస్తరిస్తోంది. పారిశుధ్యం మెరుగునకు క్షేత్రస్థాయిలో అధికారులు చర్యలు తీసుకోకపోతే ప్రజలు అనారోగ్యం బారిన పడడం ఖాయమని తెలుస్తోంది.



28వ వార్డులో నివాస గృహాల మధ్య దోమల ఉత్పత్తి కేంద్రంగా ఊటకుంట

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయాలి



అనంత వెంకటరామిరెడ్డిని సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



మెట్టు గోవిందరెడ్డిని సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బొమ్మనహాళ్: పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంతవెంకటరామిరెడ్డి, రాయదుర్గం సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి అన్నారు. పంచాయతీ రాజ్ జిల్లా ఉపాధ్యక్షుడిగా వెంకటాక్షిపతిరెడ్డి నియమించడంతో పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డిని సోమవారం వేర్వేరుగా కలిసి సన్మానించారు. జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, మెట్టు గోవిందరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు కలిసి కట్టుగా పని చేయాలన్నారు. పార్టీ బలోపేతానికి అందరం సమష్టిగా నిలబడాలని కోరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ రామాంజనేయులు, రైతు విభాగం రాష్ట్ర జాయింట్ సెక్రటరీ ఆలేరి రాజగోపాల్‌రెడ్డి, సర్పంచ్‌లు శ్రీకాంత్‌రెడ్డి, కోటేశ్వరరెడ్డి, కృష్ణ, నాయకులు రామకృష్ణ, హనుమేష్, వన్నూరుస్వామి, దేవన్న, తిప్పేస్వామి, శ్రీరాములు, కోటిరెడ్డి, కృష్ణ, రాజేశ్వరప్ప, కె.పి ఎర్రిస్వామి, గుడ్రా శ్రీరాములు,హనుమంతు, మునెప్ప, చిరంజీవి, శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వసంతోత్సవం



మయూర వాహనంపై ఊరేగిన వేంకటరమణస్వామి



శ్రీవారికి చక్రస్నానం చేయిస్తున్న అర్చకులు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని కోటలో వెలసిన ప్రసన్న వేంకటరమణస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం వసంతోత్సవం నిర్వహించారు. శ్రీవారు పదోరోజు మయూర వాహనంపై దర్శనమిచ్చారు. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు, కంకణ విసర్జన, చక్రస్నానం తదితర పూజలు చేశారు. వసంతోత్సవం అనంతరం సాయంత్రం మయూర వాహనంపై దేవేరులతో శ్రీవారిని ప్రత్యేక రథంపై ఆశీనులు చేసి పుర వీధుల్లో ఊరేగించారు. వీహెచ్‌పీ, రజక సంఘం, మాల,మాదిగ, హట్కారి కెత్తర సంఘం సభ్యుల ఆధ్వర్యంలో మయూర వాహన సేవ కొనసాగింది. మంగళవారం సప్తప్రాకారోత్సవం, శయనోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయని ఈఓ నరసింహారెడ్డి తెలిపారు.

ఘనంగా శ్రీవారి శయనోత్సవం

ఉరవకొండరూరల్: ప్రసిద్ధిగాంచిన పెన్నోహోబిలం లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం శయనోత్సవం,ధ్వజారోహణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం ప్రత్యేక అభిషేక పూజలు అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత నృసింహస్వామి ఉత్సవ మూర్తులకు చక్రస్నానాలు చేయించారు. అనంతరం అర్చకులు వసంతాలు చల్లుకుని, ప్రత్యేకంగా అలంకరించిన ఊయలపై ఉంచి శయనోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ రమేష్‌బాబు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సుందరయ్య ఆశయాలు కొనసాగిస్తాం

రాయదుర్గంటౌన్: కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య ఆశయాలను కొనసాగిస్తామని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మల్లికార్జున పేర్కొన్నారు. సోమవారం పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి కార్యక్రమాన్ని స్థానిక సీపీఎం కార్యాలయంలో నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు నాగరాజు, మధు, తిమ్మరాజు, శంకర్, రమేష్, కృష్ణానాయక్, తిప్పేస్వామి, ఆంజనేయులు, ఎస్‌ఎఫ్‌ఐ వంశీకృష్ణ, రాము, భరత్ పాల్గొన్నారు.

పుచ్చలపల్లి సుందరయ్య సేవలు ఎనలేనివి

ఉరవకొండ: పుచ్చలపల్లి సేవలు అందరికీ ఆదర్శప్రాయమని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కృష్ణమూర్తి, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి బాలరంగయ్య, పెద్దముష్టూరు వెంకటేశులు తెలిపారు. సోమవారం ఉరవకొండ సీపీఎం కార్యాలయం, ఆమిద్యాల, మోపిడి గ్రామాల్లో సుందరయ్య వర్ధంతి వేడుకలను వర్ధంతి సభలు నిర్వహించారు. పెద్దముష్టూరు వద్ద ఉపాధిహామీ కూలీలతో కలిసి కౌలు రైతు సంఘం నాయకులు సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రంగారెడ్డి, మధు పాల్గొన్నారు.

పేదల పెన్నిధి సుందరయ్య

కూడేరు: పేదల పెన్నిధి పుచ్చలపల్లి సుందరయ్య అని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కృష్ణమూర్తి కొనియాడారు. సోమవారం మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి కార్యక్రమాన్ని జరుపుకున్నారు. సుందరయ్య చిత్ర పటానికి పూల మాలలు వేసి,నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల కార్యదరి కరీం సాబ్, కమిటీ సభ్యుడు రాధాకృష్ణ, అరుణమ్మ, రామక్క, మల్లికార్జున, కాంతమ్మ, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

విడపనకల్లు: మండల కేంద్రంలో సీపీఎం ప్రాంతీయ కార్యదర్శి రంగారెడ్డి, హమాలీ యూనియన్ నాయకుల ఆధ్వర్యంలో కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. అనంతరం నాయకులు మాట్లాడారు.

వజ్రకరూరు: మండల కేంద్రంలో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి కార్యక్రమం సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు విరూపాక్షి, సీఐటీయూ నాయకుడు సుధాకర్, హమాలీ యూనియన్ నాయకుడు చంద్రశేఖర్ పాల్గొన్నారు.



పెద్ద ముష్టూరు వద్ద సుందరయ్య వర్ధంతి వేడుకలు నిర్వహిస్తున్న ఉపాధిహామీ కూలీలు, సీపీఎం నాయకులు



రాయదుర్గంలో సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు

కోల్డ్‌స్టోరేజ్‌లో కుళ్లిన బ్యాడిగ మిర్చి



కుళ్లిపోయిన బ్యాడిగ మిర్చి

కూడేరు: కర్ణాటక రాష్ట్రం బ్యాడిగికి చెందిన కోల్డ్ స్టోరేజ్ నిర్వాహకుల నిర్లక్ష్యంతో రైతు మల్లికార్జున నష్టపోయాడు. ఇప్పేరుకు చెందిన రైతు మల్లికార్జున సోమవారం విలేకరులతో మాట్లాడారు. 11 ఎకరాల్లో రూ.11 లక్షలు పెట్టుబడి పెట్టి బ్యాడిగ మిర్చి సాగు చేశానన్నారు. మార్కెట్లో గిట్టుబాటు ధర లేక ఏప్రిల్ నెలలో బ్యాడిగిలో కోల్డ్ స్టోరేజ్‌లో 60 క్వింటాళ్ల మిర్చిని నిల్వ ఉంచానన్నాడు. క్వింటా రూ.15 వేలు వరకు ధర ఉండడంతో రెండు రోజులు క్రితం కోల్డ్ స్టోరేజ్‌కు వెళ్లి విక్రయించేందుకు వెళ్తే నిల్వ ఉంచిన మిర్చి కుళ్లిపోయిందన్నారు. సరుకు నాణ్యతగా లేకపోవడంతో క్వింటా రూ.4 వేలుతో వ్యాపారులు అడుగుతున్నారని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. రూ.9 లక్షలు వరకు వచ్చేదని, కోల్డ్‌స్టోరేజ్ నిర్వాహకుల నిర్లక్ష్యంతో తీవ్రంగా నష్టపోయానని రైతు వాపోయాడు.



అధ్వానంగా ఉన్న హావళిగి - కరకముక్కల రోడ్డు

నరకానికి దారి

విడపనకల్లు: మండలంలోని హావళిగి నుంచి కరకముక్కల గ్రామాలకు వెళ్లే రోడ్డుపై వెళ్లాలంటే నరకమేనని వాహనదారులు, ప్రజలు అంటున్నారు. చాలా ఏళ్ల నుంచి ఈ రోడ్డు కంకర తేలి ద్విచక్రవాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితి ఉంది. వృద్ధులు, మహిళలు, గర్భిణులు ఈ రోడ్డుగుండా ప్రయాణించాలంటే అంతే సంగతులు. అధ్వానంగా ఉన్న రోడ్డును నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

జరుట్ల రామలింగేశ్వరుడికి అభిషేకాలు



అలంకరణలో జరుట్ల రామలింగేశ్వరస్వామి

వజ్రకరూరు: జరుట్ల రాంపురంలోని రామలింగేశ్వర స్వామికి సోమవారం అభిషేకాలు నిర్వహించారు. ఉదయం ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు, రుద్రాభిషేకం, అభిషేకాలు, అర్చనలు తదితర పూజలు జరిగాయి. సాయంత్రం కూడా ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. నగరేశ్వరస్వామి,భోగేశ్వరస్వామి, రామేశ్వరస్వామి ఆలయాల్లోనూ పూజలు జరిగాయి.

ఏటీఎంలో సాంకేతిక లోపంతో అవస్థలు

కూడేరు: స్థానిక స్టేట్ బ్యాంక్ వద్ద ఉన్న ఏటీఎం మిషన్‌లో సాంకేతిక లోపంతో విత్‌డ్రా చేసిన నగదు రాకపోవడంతో ఖాతాదారులు ఆందోళనకు గురయ్యారు. సోమవారం పదుల సంఖ్యలో స్థానిక ఏటీఎం వద్దకు నగదు డ్రా చేసుకునేందుకు వెళ్లారు. విత్‌డ్రా ఆప్షన్‌పూర్తయిన తర్వాత మొబైల్‌కు విత్‌డ్రా అయినట్లు మెసేజ్ వచ్చింది. కానీ డబ్బులు రాకపోవడంతో ఆందోళనకు గురయ్యారు. ఆలస్యంగా డబ్బు కట్ కాలేదని మెసేజ్‌లు వచ్చాయి. ఏటీఎంలో నగదు ఉన్నా సాంకేతిక లోపంతో డబ్బు లేదన్నట్టు చూపించింది. దీంతో వినియోగదారులు నిరాశతో వెళ్లిపోయారు.

శుభకార్యం



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న సమన్వయకర్త తలారి రంగయ్య

బ్రహ్మసముద్రం : సంతే కొండాపురానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు నరసింహప్ప కుమారుడు జగదీష్, శ్రీలక్ష్మి వివాహ వేడుకకు కళ్యాణదుర్గం సమన్వయకర్త తలారి రంగయ్య సోమవారం హాజరై, వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఎంపీపీ కంభం చంద్రశేఖర్‌రెడ్డి , మండల కన్వీనర్ పాలబండ్ల చంద్రశేఖర్ రెడ్డి, కళ్యాణదుర్గం రూరల్ కన్వీనర్ గోళ్ల సూరి, జిల్లా పంచాయతీ రాజ్ విభాగం కార్యదర్శి గోపాలరెడ్డి, మండల యూత్ కన్వీనర్ రాము, మల్లారెడ్డి, లింగప్ప, మంజు, పుట్టప్ప, లింగప్ప, తిప్పేస్వామి, నాయకులు హాజరయ్యారు.

అధైర్య పడొద్దు..అండగా ఉంటాం



మల్లేశప్ప కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందిస్తున్న తలారి రంగయ్య

బ్రహ్మసముద్రం : కార్యకర్తలెవరూ అధైర్యపడొద్దు.. అండగా ఉంటామని మాజీ ఎంపీ, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త తలారి రంగయ్య భరోసా ఇచ్చారు. మండలంలోని మాముడూరులో ఇటీవల మృతిచెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త మల్లేశప్ప కుటుంబ సభ్యులను ఆయన సోమవారం పరామర్శించారు. అనంతరం రంగయ్య మాట్లాడుతూ పార్టీ కోసం పని చేసిన ప్రతి కార్యకర్తకూ పార్టీ తరఫున ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం మల్లేశప్ప కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్లు పాలబండ్ల చంద్రశేఖర్‌రెడ్డి, గోళ్ల సూరి , ఎంపీపీ కంభం చంద్రశేఖర్‌రెడ్డి, పంచాయతీ రాజ్ విభాగం జిల్లా కార్యదర్శులు గోపాల రెడ్డి , వేపులపర్తి మంజునాథ, మండల యూత్ కన్వీనర్ కొండాపురం రాము, సర్పంచ్ నాగభూషణ, ఎంపీటీసీ శివన్న, నాయకులు అయ్యన్న, మంజు, కృష్ణమూర్తి, ప్రభాకర్, ప్రశాంత్, ధనుంజయ పాల్గొన్నారు.

దళిత విద్యార్థి జేమ్స్‌పై దాడి హేయం

వజ్రకరూరు: తిరుపతిలో ఇంజనీరింగ్ దళిత విద్యార్థి జేమ్స్‌పై దాడి హేయమని వైఎస్సార్‌సీపీ జిల్లా ఆర్గనైజింగ్‌సెక్రటరీ, చాబాల సర్పంచు మల్లెల జగదీష్ అన్నారు. సోమవారం ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత శాంతిభద్రతలు క్షీణించాయన్నారు. దళితులపై దాడులు పెచ్చుమీరుతున్నాయన్నారు. అధికార పార్టీ నేతల డైరెక్షన్‌లో ప్రతి చోటా కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారన్నారు. పోలీసు యంత్రాంగం కూడా ప్రజలకు భద్రత, రక్షణ కల్పించడంలేదన్నారు. బాధితులు పోలీస్ స్టేషన్‌లకు వెళ్లినా న్యాయం జరగడంలేదన్నారు. ఫిర్యాదుదారులపైనే ఎదురుకేసులు పెట్టడం ఆనవాయితీగా మారిందన్నారు. జేమ్స్‌పై దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని, లేదంటే పెద్ద ఎత్తున ఆందోళనలకు సిద్ధమవుతామని హెచ్చరించారు.

గుండెపోటుతో వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతి

విడపనకల్లు: మండలంలోని చీకలగురికి గ్రామానికి చెందిన కజ్జె మారెన్న (29) గుండెపోటుతో సోమవారం మృతిచెందాడు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు మఠ్రిస్వామి,అశోక్, శ్రీనివాసులు, మహేశ్, చంద్ర, తదితరులు మారెన్న మృతదేహానికి నివాళులర్పించారు.

అనారోగ్యంతో పాత్రికేయుడు మృతి

వజ్రకరూరు: మండలంలోని కొనకొండ్లకు చెందిన 11వబ్లాక్ వార్డు సభ్యురాలు ఈశ్వరమ్మ భర్త, పాత్రికేయుడు గుడిసి గురుప్రసాద్ (45) అనారోగ్యంతో అనంతపురం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. గురుప్రసాద్‌కు భార్య, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. సోమవారం ఉదయం వైఎస్సార్‌సీపీ యువనేత వై.భీమిరెడ్డి తదితరులు గుడిసి గురుప్రసాద్ మృతదేహంపై పూలమాలలు వేసి, నివాళులర్పించారు. సర్పంచు నంచర్ల ఇందిరమ్మ, మాజీ ఎంపీపీ రామచంద్ర, ఎంపీటీసీలు పాపన్న, మునయ్య తదితరులు గురుప్రసాద్ మృతదేహం వద్ద పూలమాల వేసి, నివాళులర్పించారు.

సంబరంగా తిరంగా యాత్ర

రాయదుర్గంటౌన్: పట్టణంలో ప్రజలు, ప్రజాసంఘాలు, మహిళలు, పార్టీలకతీతంగా నాయకులు, ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం తిరంగా యాత్ర నిర్వహించారు. స్థానిక బళ్లారి రోడ్డు ఉక్కడ సీతారామాంజనేయస్వామి కల్యాణమంటపం వద్ద ర్యాలీని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప జెండా ఊపి ప్రారంభించారు. వినాయక సర్కిల్ వరకు ర్యాలీ సాగింది. ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ పహల్గాం దాడి తర్వాత ప్రధాని నరేంద్రమోదీ సైనికుల్లో ధైర్యం నింపారన్నారు. ఆపరేషన్ సిందూర్‌తో ఉగ్రవాదుల స్థావరాలపై దాడులు చేసి, పాకిస్తాన్‌కు మన సత్తా ఏంటో చూపించారన్నారు. అనంతరం గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, మున్సిపల్ అధికారులు, మెప్మా సిబ్బంది, సచివాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

బొమ్మనహాళ్‌లో తిరంగా ర్యాలీ

బొమ్మనహాళ్: మండల కేంద్రంలో సోమవారం జాతీయ జెండాలను చేతబట్టి తిరంగా ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో తహసీల్దార్ మునివేలు, వివిధ ప్రజా సంఘాల నాయకులు హాజరయ్యారు. అనంతరం మానవహారంగా ఏర్పడి ఉగ్రదాడుల్లో అమరులైన జవాన్లకు జోహార్లు పలికారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు హీరోజీరావు, సిఖిందర్, శివరాం, ఖాదర్‌బాషా, అలివేలు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



బొమ్మనహాళ్‌లో తిరంగా ర్యాలీ చేస్తున్న తహసీల్దార్ మునివేలు తదితరులు



రాయదుర్గంలో తిరంగా ర్యాలీ